క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేముల : మండల పరిధిలోని 33/11కె.వి భూమయ్యగారిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వేల్పుల, రాచకుంటపల్లె, మబ్బుచింతపల్లె, పెద్దజూటూరు భూమయ్యగారిపల్లె గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ జేఈ రమేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. శుక్రవారం ఆయన తెలుపుతూ 33కెవి వేముల ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని.. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



జగనన్న కాలనీలో ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ జగన్నాథ్

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను శనివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు, హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇళ్ల సామగ్రి కూడా అందుబాటులో ఉండేవిధంగా చూడాల్సిన బాధ్యత హౌసింగ్ అధికారులదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ఏఈ రామక్రిష్ణతో పాటు ప్లానింగ్ సెక్రటరీలు , హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

భూ సర్వేపై అవగాహన

చెన్నూరు : జగనన్న భూ రక్ష భూ రీ సర్వే ద్వారా మండలంలోని ముండ్లపల్లె గ్రామ పంచాయతీలో శనివారం భూములకు రెవిన్యూ అధికారులు హద్దురాళ్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ సరస్వతి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇప్పటికే జగనన్న భూ రక్ష భూసర్వే పై రైతులకు అవగాహన కల్పించినట్లు ఆమె తెలియజేశారు. ముండ్లపల్లె గ్రామంలో 473 మంది రైతులకు సంబంధించిన 812 సర్వే నంబర్లలో గల 884.55 ఎకరాల భూమికి హద్దురాళ్లు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సోమశేఖర్, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి



కళాశాల బ్రోచర్లను ప్రదర్శిస్తున్న కళాశాల డీన్, అధ్యాపకులు

పులివెందుల టౌన్ : ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో ఉన్న వనరులను చక్కగా ఉపయోగించుకోవాలని కళాశాల డీన్ డాక్టర్ మణి విద్యార్థులకు సూచించారు. శనివారం పట్టణంలోని ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన కాలేజ్ అండ్ హాస్టల్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా బెంగుళూరు సఫల్ మార్కెట్ యూనిట్ అధ్యక్షుడు బీ.ఎం.నిజగుణ, కళాశాల అసోసియేట్ డీన్ మణి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ కళాశాల నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వర్షం కురవాలని భజనలు

లింగాల : మండల పరిధిలోని ఎగువపల్లె గ్రామంలో వర్షం కోసం గత మూడు రోజులుగా భజనలు చేస్తున్నారు. శనివారం గ్రామంలో తిరుగుతూ కొండ మీద ఉన్న చింతల వెంకటరమణస్వామి వద్దకు వెళ్లి భజనలు చేశారు. ఇలా భజనలు చేయడంవల్ల వరుణుడు కరుణించి వర్షం వస్తుందని గ్రామస్తుల నమ్మకం.

బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ కొత్త గంగమ్మ తిరునాల ఉత్సవాలు శనివారం రెండవ రోజు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకు పూజ, పంచామృతాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాయ కర్పూరాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో చెక్కభజన కార్యక్రమం, అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ఆవరణంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల్లో పద కొండు జతల ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు ఆలయ కార్యనిర్వాహకులు బహుమతులు అందజేశారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి



జమ్మలమడుగు: ప్రతిభ చూపిన విద్యార్థికి నగదును అందిస్తున్న ఉపాధ్యాయ బృందం



కమలాపురం: జగనన్న ఆణిముత్యాలు నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థిని విష్ణుప్రియ



చింతకొమ్మదిన్నె: విద్యార్థి తల్లికి నగదు, ప్రశంసాపత్రం అందజేస్తున్న మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి

చింతకొమ్మదిన్నె : విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొలుముల్లపల్లి ఉన్నత పాఠశాల, సికెదిన్నె జడ్పీ హై స్కూల్‌లో జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన నగదుతో పాటు దాతలు ఇచ్చిన నగదు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

తొండూరు : తొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ చాటి మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు శనివారం జగనన్న ఆణిముత్యాలు పథకం కింద నగదు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికలాంగ సేవకుడు జనార్ధన్‌రెడ్డి హాజరై వైష్ణవి, స్పందన, హప్సలకు నగదు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లోనే కాకుండా పాఠశాల స్థాయిలో కూడా నగదు బహుమతులను అందించడం అభినందనీయమన్నారు. విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని.. అనేక పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు కొండారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం గుల్లకుంటకు చెందిన బీఆర్ అంబేద్కర్ వెలుగు పాఠశాలకు చెందిన వెన్నెల, చౌడీప్రియ జిల్లా స్థాయిలో రెండు ,మూడు స్థానానికి జగనన్న ఆణిముత్యాలకు ఎంపికై జిల్లా కలెక్టర్ విజయరామరాజు చేత సన్మాన కార్యక్రమంతోపాటు రూ.30 వేలు, రూ.15 వేల నగదుతోపాటు అవార్డు పొందినట్లు ప్రిన్సిపల్ ప్రభావతి పేర్కొన్నారు. శనివారం కడపలో జరిగిన జగనన్న ఆణి ముత్యాల కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థులు నగదు, ప్రశంసాపత్రం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు కమలాపురం విద్యార్థిని

కమలాపురం : కమలాపురం పట్టణంలోని గురుకుల పాఠశాలకు చెందిన ఎల్. విష్ణుప్రియ జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఎంపికైందని ప్రిన్సిపల్ జి.తులసమ్మ తెలిపారు. శనివారం కడపలో జరిగిన జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విష్ణుప్రియకు జిల్లా కలెక్టర్ విజయరామరాజు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ప్రభుత్వం అందించిన రూ.50 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, మెడల్ బహూకరించారు. విద్యార్థిని తండ్రితో పాటు, పాఠశాల ప్రిన్సిపల్‌ను సన్మానించారు. ఇంటర్‌లో 895 మార్కులు సాధించిన విష్ణుప్రియకు ఇటీవల కమలాపురంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలులో సైతం నగదు బహుమతి రావడం తెలిసిందే. కాగా జిల్లా స్థాయిలో రూ.50వేలు నగదు బహుమతి రావడం సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ తెలిపారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

జమ్మలమడుగు: చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు జరినాబేగం పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులకు కావలసిన మౌళిక సదుపాయాలతో పాటు వారికి మంచి పౌష్టికాహారం, ఉన్నతమైన విద్యను అందిస్తోందన్నారు. అనంతరం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుంటేనే వారికి భవిష్యత్తు ఉంటుందన్నారు. తల్లిదండ్రులు మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాము శ్రీనాథ్, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

వేంపల్లె : స్థానిక రాజీవ్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం వేంపల్లె పట్టణానికి చెందిన స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ రమణారెడ్డి కుమారుడు విష్ణు స్వరూప్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం వారికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు విష్ణు, ధరణి, బయమ్మ పాల్గొన్నారు.

రేపు శిక్షణా కార్యక్రమం

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ సభా భవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24వ తేదీ నుంచి జులై 23వ తేదీ వరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది తప్పని సరిగా హాజరు కావాలని తెలియజేశారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని సంగాలపల్లె, మిట్టపల్లె, లింగాల గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, యువ నాయకుడు నరేన్ రామాంజుల్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలియజేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రోడ్డు, యూజీడీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని భాకరాపురంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన భాకరాపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అక్కడే ఉన్న కిరాణా షాపును ఆయన తనిఖీ చేసి షాపులో ఉన్న ప్లాస్టిక్ కవర్లను పట్టుకుని మున్సిపల్ సిబ్బందికి అందించారు. ప్లాస్టిక్ కవర్లు వాడరాదని షాపు యజమానిని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన



ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : గాలేరు-నగరి ప్రధాన కాలువనుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఆకుతోటపల్లె చెరువుకు నీటిని తరలించడానికి జరుగుతున్న పనులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. జీయన్‌యస్‌యస్ కాలువ నుంచి పైప్‌లైన్ ద్వారా ఈ పనులను చేపడుతున్నట్లు, త్వరలోనే ఈ పథకం పూర్తి అవుతుందని, ఈ పథకం ద్వారా సుమారు 2500 ఎకరాలకు సాగునీరందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. 8 గ్రామాల్లోని చెరువులకు సాగు నీరందించడానికి ఈ పథకాన్ని మంజూరు చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముని రాజా రెడ్డి, పార్టీ నాయకులు శ్రీధర్ రెడ్డి, శివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయండి



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

సింహాద్రిపురం : జగనన్న ఇంటి నిర్మాణాలు ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని పులివెందుల పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం జరిగే సమావేశానికి మండల కేంద్రంలో జగనన్న ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా హాజరు కావాలని.. అలాగే వచ్చే నెల 30వ తేదీకల్లా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని, అలా చేయని యెడల వారికి మంజూరు చేసిన ఇళ్లు రద్దు చేస్తామన్నారు. వారి స్థానంలో కొత్త వారిని ఎంపిక చేస్తామన్నారు. మండల కేంద్రంలోని డ్రైనేజీ కాలువ పనులు త్వరగా పూర్తి చేసి కొత్త రోడ్లను నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న వైవీయూ వీసీ చింతా సుధాకర్

పులివెందుల టౌన్ : ప్రస్తుత కాలానుగుణంగా విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని యోగివేమన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల (వైఎస్ఆర్ఆర్) వార్షిక దినోత్సవ వేడుకలు ప్రిన్సిపల్ అమల్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో నూతన సాంకేతికత తెలుసుకుని అందులో రాణించి ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. చదువుకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మంచి భవిష్యత్ పొందాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ అమల్‌రాజ్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు క్రమ శిక్షణతో మంచి ఉత్తీర్ణత సాధించారని.. రాబోయే కాలంలో ప్రతి విద్యార్థి కూడా బాగా రాణించాలన్నారు. కళాశాల అభివృద్ధి, విద్యాభివృద్ధికి సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, విద్యలో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలను అందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లయోలా కరస్పాండెంట్ ఆంథోని స్వామి, లయోలా పాల్‌టెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బ్రిట్టో, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌పీజీ దహన వాటిక పరిశీలన



పుట్టపర్తిలోని అమరధామ్ ఎల్‌పీజీ దహన వాటికను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్,

పులివెందుల టౌన్ : అత్యాధునిక సౌకర్యాలతో సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిర్మించిన ఎల్‌పీజీ దహన స్మశాన వాటికను శనివారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులలో అత్యాధునిక సౌకర్యాలతో ఎల్‌పీజీ దహన స్మశాన వాటికను ఏర్పాటు చేసేందుకు పుట్టపర్తిలోని అమరధామ్ ఎల్‌పీజీ దహన వాటికను పరిశీలించడం జరిగిందన్నారు. అక్కడి సిబ్బందితో దహన సంస్కారాల కార్యక్రమాలు ఎలా ఉంటాయి, ఏ విధంగా నిర్వహిస్తున్నారు, జాగ్రత్తలు తదితర అంశాలపై ఆయన ఆరా తీశానన్నారు. భవిష్యత్‌లో పులివెందులలో కూడా వసతులతో కూడిన ఎల్‌పీజీ దహన వాటికను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కో.ఆప్సన్ మెంబర్ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

వల్లూరు : వల్లూరు మండలం గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని రేణుశ్రీ జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైంది. కళాశాలలో ఇంటర్ మీడియట్ సెకండియర్ సిఈసీ గ్రూపులో చదివిన రేణుశ్రీ 896 మార్కులు సాధించింది. ఈ మేరకు కడపలో కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో శనివారం జరిగిన జగనన్న ఆణిముత్యాలు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ విజయ రామరాజు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబుతో కలిసి ఆమె రూ 50 వేల నగదు బహుమతిని అందుకుంది.

పశు బీమా సద్వినియోగం చేసుకోవాలి

చింతకొమ్మదిన్నె : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శారదమ్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెద్ద కాంపల్లి గ్రామంలో పశు పోషకులకు పశు బీమా పథకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని పశువులు, గొర్రెలు, మేకలు, పందులు ప్రమాదవశాత్తు మరణిస్తే పశు పోషకులు ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమాను ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధశాఖ ఉప సంచాలకులు టీవీ రమణయ్య, మండల సహాయ సంచాలకులు శ్రీధర్ లింగారెడ్డి, నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

పథకాలు వినియోగించుకోండి

పులివెందుల రూరల్ : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగపరుచుకోవాలని తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని వలంటీర్లు ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఎంపీడీఓ వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధి ద్వారా వచ్చే పండ్ల తోటలను రైతులు సద్వినియోగపరుచుకోవాలన్నారు. మండల స్పెషలాఫీసర్ అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్‌కు సంబంధించిన ఎం-బుక్‌లను ఎప్పటికప్పుడు తయారు చేస్తూ లబ్ధిదారులకు డబ్బులు అకౌంట్‌లో జమ అయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, ఏఓ నాగలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న జేసీబీ

వేంపల్లె : వేంపల్లె నుంచి పులివెందులకు వెళ్లే రోడ్డులో బైకుపై వెళుతున్న ఐస్ వ్యాపారి రఫిని జేసీబీ ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయమై వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు.

పీహెచ్‌సీ తనిఖీ



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న శాంతికళ

ఎర్రగుంట్ల : ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ కేసులు పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టరు శాంతికళ తెలిపారు. శనివారం ఎర్రగుంట్ల మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న డెలివరీ గదిని, ల్యాబ్ తనిఖీ చేశారు. తర్వాత ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, పిల్లల నమోదు సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు సీ సురేష్మా, సీహెచ్ఓ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ విజయకుమారి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బాలయ్యగారిపల్లెలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గొందిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని బాలయ్యగారిపల్లె, తిప్పిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని కొత్త గిరియంపల్లె, పాతగిరియంపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, ధనుంజయరెడ్డి, రామగంగి రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, నరసింహా రెడ్డి, బసిరెడ్డి, బాబుల్ రెడ్డి, సుబ్బిరెడ్డి, మహీధర్ రెడ్డి, నాగ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



చెరువుకిందిపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్ఓ

వల్లూరు : ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ తో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ అయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఖాదర్ వలీ పేర్కొన్నారు. మండలంలోని తప్పెట్ల గ్రామ సచివాలయ పరిధిలోని చెరువు కిందిపల్లె గ్రామంలో శనివారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డా ఫణీంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి



ఏఎన్ఎంలు చేస్తున్న సేవలను యాప్ ద్వారా పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ ఖాదర్‌వల్లి

కమలాపురం : గర్భిణీలు, బిడ్డలకు తప్పని సరిగా టీకాలు వేయించాలని జిల్లా వైద్యాధికారి ఖాదర్ వల్లి తెలిపారు. శనివారం మండలంలోని పెద్దచెప్పలి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి వార్డు, ల్యాబ్, టీకాలు నిల్వ ఉంచు గదిని తనిఖీ చేశారు. సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం కోగటం హెల్త్ సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు నమోదు చేసే యాప్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజియన్ కాన్సెప్ట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పెద్దచెప్పలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జావలి ప్రసూన, సీహెచ్ఓ లలితమ్మ, ఎంపీహెచ్ఈఓలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కమిటీ సభ్యుల మధ్య బాహాబాహీ

వేంపల్లె : వేంపల్లె ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యుల మధ్య శనివారం బాహాబాహీ చోటు చేసుకుంది. సంఘంకు సంబంధించి డబ్బుల విషయమై శనివారం సంఘం పెద్దలు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వడ్లకుంట రాజారావు మాట్లాడుతూ అదే సంఘంలో ఉన్న కమిటీ సభ్యులు రామచంద్ర ఇటీవల ఐపీ పెట్టారని, ఆ వ్యక్తికి సంబంధించి రూ.29 లక్షలు సంఘానికి బాకీ పడ్డారని, ఈ క్రమంలో అతనికి జామీన్ వేసిన వారు ఈ మొత్తాన్ని చెల్లించాలని తెలిపారు. అందుకు నిరాకరించిన కమిటీ సభ్యుడు పుల్లగూర అరవింద్‌పై సంఘం అధ్యక్షుడు వడ్లకుంట రాజారావు, బంధువు దొంతు సుబ్బారావులు చేయి చేసుకుని చొక్కాని చింపివేశారు. దీంతో మాటామాట పెరిగి వారిరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో మొత్తం 45 మంది కమిటీ సభ్యులు ఉండగా.. 38 మంది సభ్యులు రాజీనామా చేశారు. అంతేకాకుండా చేయి చేసుకున్న అధ్యక్షుడు రాజారావు, సుబ్బారావులపై కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యుడు పి.అరవింద్ ఫిర్యాదు మేరకు పోలీసులు వారిద్దరిపై కేసు నమోదు చేశారు. రెండు రోజుల్లో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి కొత్త కమిటీని ఎన్నుకుంటామని ఆ సంఘం గౌరవ అధ్యుడు పిసుపోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు.

భూ వివాదంలో మహిళకు గాయాలు

ముద్దనూరు : మండలంలోని ఆరవేటిపల్లె గ్రామంలో భూ వివాదంలో ఇరువురి మధ్య శనివారం జరిగిన ఘర్షణలో గంగులమ్మ అనే మహిళకు గాయాలయ్యాయి. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు ఆరవేటిపల్లెలో గంగులమ్మ, లక్ష్మినారాయణల మధ్య సుమారు 50 సెంట్ల భూమికి సంబంధించి వివాదం వుంది. భూమిలో లక్ష్మినారాయణ కంచె వేశారని ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో లక్ష్మినారాయణ గంగులమ్మపై రాయితో దాడి చేయగా ఆమె తలకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు లక్ష్మినారాయణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పవన్ కల్యాణ్ ముందు ఎమ్మెల్యేగా గెలువు

పులివెందుల రూరల్ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముందు నువ్వు ఎమ్మెల్యేగా గెలువు తర్వాత సీఎం అయ్యేది కానిది చూద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ ఎద్దేవా చేశారు. శనివారం స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం కావడానికి నీకు నైతిక విలువలు ఉన్నాయా పవన్..అని ప్రశ్నించారు.నీవు కానీ, లోకేష్ కానీ ప్రజాక్షేత్రంలో గెలవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే నైతిక విలువలు మీకు లేవన్నారు. నీవు విలువల గురించి, సాంప్రదాయాల గురించి మాట్లాడే అర్హత ఎప్పుడో కోల్పోయావు అన్నారు.